అమ్మల ఆశలపై నీళ్లు

'యూ టర్నుల చంద్రబాబు మళ్లీ మొదలెట్టేశారు. ప్రపంచంలో రంగులు మార్చని ఊసరవెల్లి ఉంటుందేమో గానీ.. మాట మార్చని చంద్రబాబును మచ్చుకైనా ఊహించుకోలేం. చివరిగా ఒక్క అవకాశం ఇవ్వండి.. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తానన్న బాబును నమ్మి మళ్లీ మోసపోయాం'. ఇదీ తల్లికి వందనం జీవో విడుదల తర్వాత విశాఖ తూర్పు నియోజకవర్గంలోని ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లుల మనోగతం.



స్కూల్‌కు వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు చొప్పున చెల్లిస్తామని టీడీపీ ఇచ్చిన ప్రకటన

- తల్లికి వందనం జీవోలో మెలికపై తల్లుల ఆవేదన
- ఎంత మంది పిల్లలున్నా లబ్ధి ఒక్కరికేనా?

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ/బీచ్ రోడ్డు : ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకున్నా.. అందరికీ చెరో రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పథకం లబ్ధి చేకూర్చుతానని హామీలు గుప్పించిన బాబు.. తీరా అధికారంలోకి వచ్చాక నాలుక మడతెట్టారు. అవే పలుకులు పలికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా చంద్రబాబు హామీలకు వత్తాసుగా నిలిచారు. పిల్లల లెక్కలు తీసేసి కేవలం ఒక్కో తల్లికి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు జీవో నెం.29 పేరిట బుధవారం మార్గదర్శకాలు జారీ చేశారు. దీనిపై నియోజకవర్గంలోని విద్యార్థుల తల్లుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాబును నమ్మి మరోసారి మోసపోయామంటూ వాపోతున్నారు.

స్కూల్ ఫీజు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు..



నాకు ఇద్దరు పిల్లలు. ఆరిలోవలో వీఎస్‌టీ స్కూల్‌లో మా బాబు అజయ్ ఏడో తరగతి చదువుతున్నాడు. నా కుమార్తె వర్షిణి ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు తెరిచిసరికే అమ్మఒడి డబ్బులు వేసేవారు. ఆ డబ్బులతో స్కూల్ ఫీజు కట్టేవాళ్లం. ఇప్పుడు ఇంకా డబ్బులు వేయలేదు. దీంతో స్కూల్‌కు ఫీజు కట్టలేకపోతున్నాం. ఫీజు కట్టాలని పాఠశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తుంది. ఎన్నికల్లో ఇద్దరు పిల్లలుంటే తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున రూ. 30 వేలు వేస్తామని చెప్పారు. ఇప్పుడు ఒక్కరికే డబ్బులు వేస్తారని జీవో విడుదల చేశారని అంటున్నారు. ఇలా మోసం చేయడం దారుణం. ఇద్దరు పిల్లలకు పథకం వర్తింపజేస్తారన్న హామీ ఇవ్వడంతో ఆశతో ఓటు వేశాం. ఆ హామీ నెరవేర్చాలి.

– వంకల అసిరితల్లి, ఆరిలోవ

కూటమి ప్రభుత్వం తీరు సరికాదు



ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు చొప్పున చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ నేటికి పథకం అమలుకు నోచుకోలేదు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తోంది. ప్రైవేట్ పాఠశాలల నుంచి ఫీజుల కోసం ఒత్తిడి వస్తోంది. మరోవైపు ప్రభుత్వం తల్లికి వందనంపై జీవో విడుదల చేసి కొత్త మార్గదర్శకాలు సూచించడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఎలాంటి నిబంధనలు లేకుండా బడికి వెళ్లే పిల్లల తల్లికి వైఎస్ జగన్ సర్కారు అమ్మఒడి అమలు చేసింది. కానీ టీడీపీ ప్రభుత్వం తల్లికి ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ నిధులిస్తామని చెప్పి ఇప్పుడు ఆంక్షలు విధించడం సరికాదు. ఇప్పటికైనా నిబంధనలు సవరించి అర్హులైన తల్లుల పిల్లలు అందిరికీ రూ.15 వేలు చొప్పున అందజేయాలి.

– పి.సత్యవతి, ఆదర్శనగర్

మా ఇద్దరు పిల్లలకీ పథకం వర్తింపజేయాలి



నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దర్నీ ఓ ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేలు అందేది. ఈ ఏడాది ఎన్నికల్లో తల్లికి వందనం పేరిట కూటమి నాయకులు ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మా ఇంట్లో చదువుతున్న ఇద్దరు పిల్లలకు పథకం వర్తింపజేస్తూ రూ. 30వేలు అందజేయాల్సి ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుపై విడుదల చేసిన జీవో మార్గదర్శకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిబంధనల పేరుతో మోసం చేయాలని చూస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీకి అనుగుణంగా చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం నిధులు మంజూరు చేయాలి.

– చింతపల్లి మమత, ఆదర్శనగర్

స్కూల్ ఫీజు చెల్లింపునకు ఎదురుచూస్తున్నా..



నాకు ఇద్దరు పిల్లలు. వారిని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నా. వారి ఫీజుల కోసం వేలల్లో వెచ్చిస్తున్నా. గత వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో అమ్మ ఒడి కింద రూ.15 వేలు అందేది. అది కొంత వరకు సాయంగా నిలిచేది. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తమ హామీల్లో భాగంగా చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం కింద రూ.15వేలు చొప్పున ఇస్తామన్నారు. ఆ లెక్కన మాకు రూ.30 వేలు రావాలి. అయితే ఈ పథకం జీవోలో ఒక్కరికే పథకం వర్తింపజేస్తామని నిబంధన ఉండడం దారుణం. మా ఇద్దరి పిల్లలకు ఇస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల హామీ మేరకు మా ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి. పథకం డబ్బుల కోసం ఆశగా ఎదురు చేస్తున్నాం

– పిల్లలతో శిరీష, రామ్‌నగర్

ఇద్దరి పిల్లలకు వస్తుందనుకున్నా..



నా ఇద్దరి పిల్లలు సెవెన్త్ డే స్కూల్లో 4, 5 తరగతులు చదువుతున్నారు. వారిద్దరికీ తల్లికి వందనం పథకం వర్తిస్తుందని ఆశపడ్డాను. కానీ కూటమి ప్రభుత్వం ఒక్కరికి మాత్రమే చెల్లిస్తామని జీవో విడుదల చేయడంతో చాలా నిరాశకు గురయ్యా. ఇద్దరి పిల్లలకు పథకం వర్తిస్తే ఆర్థిక భరోసా లభించేది. కానీ ఇప్పుడు ఇలా చేయడం చాలా బాధగా ఉంది. ఎన్నికల హామీ మేరకు ఇద్దరి పిల్లలకు పథకం వర్తింపజేయాలి.

– పిల్లలతో శ్రావణి సంధ్య, రామ్‌నగర్

క్లుప్తంగా

ఆకట్టుకున్న నృత్యోత్సవం



నృత్యోత్సవంలో నాట్య విన్యాసం

మద్దిలపాలెం: నాట్యరవళి నృత్యోత్సవం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నాట్యరవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకను ముఖ్య అతిథులుగా నటరాజ పరమేశ్వర్, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం నటరాజ పరమేశ్వరన్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయం కళలకు పుట్టినిల్లు అన్నారు. కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు నాట్యం మార్గదర్శకంగా నిలిచిందన్నారు. అనంతరం ప్రదర్శించిన నాట్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

మాధవధార నుంచి ఆర్కే బీచ్‌కు సిటీ బస్సు సర్వీసు

డాబాగార్డెన్స్: ఉత్తర నియోజకవర్గ పరిధి మాధవధార, ఎన్‌జీవోస్ కాలనీ నుంచి ఆర్కేబీచ్, సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు 48–ఎస్ రూట్ నంబర్‌తో సిటీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల ప్రయాణికుల సౌకర్యార్థం సింహాచలం, ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు డైరెక్ట్‌గా ఈ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆయా ప్రాంతాలకు రూట్ నంబర్ 48–ఎస్‌తో రెండు సిటీ సర్వీసులు తిప్పుతున్నట్టు చెప్పారు. ఈ బస్సులు ఆర్కే బీచ్ నుంచి బయలుదేరి కలెక్టర్ ఆఫీస్, జగదాంబ, సూర్యాబాగ్, డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, దొండపర్తి, అక్కయ్యపాలెం, మధుసూదన్ నగర్, మాధవధార వుడా కాలనీ, ఆర్ అండ్ బీ, ఎన్ఏడీ, గోపాలపట్నం మీదుగా సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు చేరుతుందని, సింహాచలం బస్ కాంప్లెక్స్ నుంచి అదే మార్గంలో ఆర్కే బీచ్‌కు చేరునని ప్రజా రవాణా అధికారి చెప్పారు.

టైమింగ్స్ ఇలా..

ఆర్కే బీచ్ నుంచి బయలుదేరు సమయం
ఉదయం 05:45, 06:45, 08:15, 09:15, 10:45, 11:45, మధ్యాహ్నం 1:55, 2:55, సాయంత్రం 5:25, 5:25, 6:55, రాత్రి 7:55

సింహాచలం నుంచి బయలుదేరు సమయం
ఉదయం 06:55, 07:55, 09:25, 10:25, 11:55, 12:55, మధ్యాహ్నం 3:05, సాయంత్రం 04:05, 05:35, 06:35, రాత్రి 08:20, 09:05

రైల్వే స్టేషన్ నుంచి గంభీరానికి బస్సు సౌకర్యం

డాబాగార్డెన్స్:భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గంభీరంకు రూట్ నంబరు 25–ఐఐఎమ్ సిటీ బస్సు సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. ఈ బస్సు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, మారికవలస మీదుగా ఐఐఎంకి చేరునని తెలిపారు.

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరు సమయం
ఉదయం 07:30, 10:20 మధ్యాహ్నం ఒంటి గంటకు..

ఐఐఎం నుంచి బయలుదేరు సమయం:
ఉదయం 08:55, 11:35, మధ్యాహ్నం 14.30, 18:15

ఆరిలోవ రైతుబజార్ నిర్మాణం పరిశీలన

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువు వద్ద చేపట్టిన రైతుబజార్ నిర్మాణాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం పరిశీలించారు. ఇక్కడ ఇంకా ఏయే పనులు జరగాల్సి ఉన్నాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.80 లక్షలతో చేపడుతున్న ఈ రైతుబజార్‌కు ఇంతవరకు సగం నిధులు మాత్రమే ఇచ్చారని, అందుకే పనులు పూర్తి కాలేదని కాంట్రాక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పెండింగ్‌లో ఉన్న నిధులు త్వరలో మంజూరు చేయిస్తానని ఆయన కాంట్రాక్టర్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. పైనాపిల్ కాలనీ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు తొలగింపు, ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీబీడీ రీజనల్ కార్యాలయం, పైనాపిల్ కాలనీ, జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, కామాక్షినగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ముడసర్లోవ, గోల్ఫ్ క్లబ్, తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మద్దిలపాలెం: జీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. జీఆర్‌నగర్, వెంకోజీపాలెం, ఇసుకతోట, ల్యాన్సన్, ఇసుకతోట, భానునగర్, తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

- పెదవాల్తేరు 11కేవీ ఫీడర్ పరిధిలో కాగితాల వీధి, మధ్యవారివీధి, పెదవాల్తేరు ఫిష్ మార్కెట్, లాసన్స్‌బే కాలనీ ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ తెలిపారు.
- యాసిన్ మసీద్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రామాటాకీస్, యాసిన్ మసీద్, ప్రేమా ఆసుపత్రి ప్రాంతాలలో, రేసపువానిపాలెం ఫీడర్ పరిధిలో సీఎంఆర్ సెంట్రల్, రేసపువానిపాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

మద్దిలపాలెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 20వ తేదీ వరకూ పొడిగించినట్టు డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకూ స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్‌లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వెబ్ ఆప్షన్‌లో మార్పులు చేసుకోవడానికి ఈ నెల 27వ తేదీ వరకూ అవకాశం కల్పించారన్నారు. ఈ నెల 31న తొలి దశ సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న 18వ వార్డు వైద్యాధికారులు, మలేరియా విభాగం ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ: సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియాపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని 18వ వార్డు వైద్యాధికారులు, జీవీఎంసీ జోన్–3 మలేరియా విభాగం సిబ్బంది సూచించారు. ఈ మేరకు 18వ వార్డులోని అప్పుఘర్‌లో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ దిశగా జీవీఎంసీ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి సహకారం అందించాలన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం



ఆరిలోవ కాలనీలో సమావేశమైన దివ్యాంగులు

ఆరిలోవ: ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద గురువారం దివ్యాంగుల రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దివ్యాంగుల రైట్స్ ఫోరం అధ్యక్షుడు సురేష్ మీనన్ మాట్లాడుతూ దివ్యాంగులు అంతా సంఘటితంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా అంతా కలసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం దివ్యాంగులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఫోరం సభ్యులు ఆలీ, తిరుపతి, భారతి, సత్యవతి పాల్గొన్నారు.

మన భద్రతకే ట్రాఫిక్ నిబంధనలు



మాట్లాడుతున్న వెంకట శేషమ్మ



పాల్గొన్న సీతమ్మధార రైతుబజార్ రైతులు

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ అన్నారు. సీతమ్మధార రైతుబజారులో గురువారం రైతులు, వినియోగదారులను ఉద్దేశించి ఆమె పలు సూచనలిచ్చారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేకుంటే నేరమన్నారు. మోటార్ వాహన చట్టాలను వివరించారు. టీపీటీ కాలనీలోని ఎన్‌బీఎం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీడీఎం కోర్టు జడ్జి జి.స్వర్ణ, పీఎల్‌పీయూఎస్ అధ్యక్షుడు జి.వల్లభనాయుడు, ఏడీఎం కోర్టు సూర్యకళ, ప్యానల్ లాయర్ కె.రవిశంకర్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బీచ్ రోడ్డు: మనస్తాపంతో ఉరి పోసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సీఎంఆర్ వెనక వైపు నివాసం ఉంటున్న గొవడ రైతేష్(22) ఒక కాలేజీలో బీబీఏ రెండో ఏడాది చదువుతున్నాడు. బుధవారం రాత్రి భోజనం చేసి తన గదిలో నిద్రపోయాడు. ఉదయం ఎంత సేపటికి బయటకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గదిలోకి వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. బీబీఏ పరీక్ష ఫలితాల్లో నాలుగు సబ్జెక్ట్స్ ఫెయిల్ కావడంతో మనస్తాపంతో ఉరివేసుకొని ఉండవచ్చునని ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌కి పరికరాల అందజేత

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ ఎ.సురేష్ రూ.1.4 లక్షల విలువ చేసే తాత్కాలిక ఫేస్ మేకర్‌కు అవసరమైన పల్స్ జనరేటర్, లెడ్ పరికరం కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి గురువారం అందజేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సమక్షంలో కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మికి ఈ పరికరాన్ని ఆయన అందించారు. తీవ్రమైన గుండె జబ్బుతో ఇబ్బంది పడే రోగులకు ఈ పరికరం అమర్చడం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చు. సురేష్ ప్రస్తుతం మెడికవర్ ఆస్పత్రి(విశాఖ)లో ఎలక్ట్రో ఫిజియాలజిస్టు, కార్డియాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. విలువైన పరికరాలు అందజేసిన సురేష్‌ను అభినందించారు.

కృష్ణా కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం లెర్నింగ్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎన్‌డీఎల్ఐ క్లబ్ ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. అనంతరం ఓరియంటేషన్ కార్యక్రమం ఉద్దేశించి ప్రసంగించారు. క్లబ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకి విరాళం చెక్కు అందిస్తున్న హేమలత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని సీబీఐ కాంపౌండ్‌కి చెందిన హేమలత గురువారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావుకి అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

రెండో శనివారం స్కూళ్లకు సెలవు ఇవ్వాలి

విశాఖ విద్య: రెండో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారాం వెల్లడించారు. ప్రతీ నెలా రెండో శనివారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యా క్యాలెండర్ పని దినాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్స్ చేస్తామన్నారు.

లలితా పీఠంలో వారాహి హోమం



వారాహి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో ఈ నెల 6 నుంచి జరుగుతున్న వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా గురువారం సాయంత్రం వారాహి హోమం నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేద మంత్రాల మధ్యం శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. పలువురు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముందుగా వారాహి దేవికి సహస్ర నామార్చన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 15వ తేదీతో నవరాత్రులు ముగుస్తాయని అయన తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు తోటగరువు విద్యార్థులు





ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన తోటగరువు హైస్కూల్ విద్యార్థులు రత్నసావియా, రామ్‌చరణ్

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. ఈ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కె.రత్నసావియా, టి.రామ్‌చరణ్ ఉత్తమ మార్కులు సాధించారు. ఇక్కడ 427 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వారిలో 287 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో రత్నసావియా 584/600 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలవగా, రామ్‌చరణ్ 579/600 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరిద్దరూ నూజీవీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం జి.భవాని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రత్నసావియా, రామ్‌చరణలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ట్రిపుల్ ఐటీ చదవాలనే ఆయా విద్యార్థుల కోరిక నెరవేరిందని హెచ్ఎం ఆనందం వ్యక్తం చేశారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత



ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ జరిగింది. రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వర రావు మాట్లాడతూ పెరుగుతున్న జనాభాను నియంత్రించవలసిన అవసరం ఉందన్నారు. జనాభా పెరుగుదల వలన అభివృద్ధి తగ్గుతుందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ఇతర సమస్యలను పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీష్ ప్రసాద్, ధర్మేంద్ర, విష్ణు, ఎస్.బేగం, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు శశి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో సమస్యలు



సభలో మాట్లాడుతున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: జనాభా పెరుగుదలతో పలు సమస్యలు ఎదురవుతాయని కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం మద్దిలపాలెంలోని కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా నియంత్రణ చాలా అవసరమన్నారు. అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవంపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు పాల్గొన్నారు.